

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	44.7	27.0
భద్రాద్రి	46.0	26.0



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు



కొత్తగూడెంలో జనజాతర సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థులు రఘురాంరెడ్డి, బలరాంనాయక్



సభలో పార్టీ శ్రేణులకు రేవంత్ అభివాదం

3 లక్షల చొప్పున

మెజారిటీ ఇవ్వాలి..

- ఖమ్మం, మహబూబాబాద్ అభ్యర్థులకు ఘన విజయం చేకూర్చాలి
- దేశ రాజకీయాలకు దిక్సూచి ఖమ్మం జిల్లా
- ఇక్కడంతా ముఖ్యమంత్రి స్థాయి వారే...
- ఈ జిల్లా రాజకీయాల్లో నేను తలదూర్చను
- తెలంగాణ ఉద్యమం ఇక్కడే మొదలైంది
- బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పారు.. ఇప్పుడు మోదీకీ చెప్పాలి...
- కొత్తగూడెం జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్, వామపక్షాల శ్రేణులు

ఖమ్మం, ఆంధ్రజ్యోతి ప్రతినిధి/కొత్తగూడెం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా... ఉద్యమాల ఖిల్లా అని, దేశ రాజకీయాలకు దిక్సూచిలాంటిదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్యవంతమైన ఈ జిల్లాలోని పాల్వంచలోనే 1969లో తొలి తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందన్నారు. ఆ తరువాత జరిగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాల్లోనూ ఈ జిల్లా చురుకైన పాత్ర పోషించిందన్నారు. రాజకీయంగా ఎంతోమంది మేధావులు ఈ జిల్లాలో ఉన్నారని ప్రశంసలు కురిపించారు. కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో శనివారం ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్‌ల విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్, మిత్రపక్షాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనజాతర బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సభలో ఆయన ప్రసంగిస్తూ గొప్ప చరిత్ర, పోరాట పటిమ కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగే ఏ ఎన్నికల్లోనైనా ప్రజలు ఏ అభ్యర్థికి ఓటు వేయాలో ముందుగానే పసిగట్టి ఆ అభ్యర్థినే గెలిపిస్తారన్నారు.'ఖమ్మం జిల్లా రాజకీయాలంటే నేను ఆచితూచి వ్యవహరిస్తా.. ఈ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో నేను తలదూర్చను.. ఈ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు పట్టుదలతో ఉంటారు... ఢిల్లీ దాకా వెళ్లయినా తమ పంతాన్ని నెగ్గించుకుంటారు.. ఇక్కడ అంతా ముఖ్యమంత్రి సమానులే..' అని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రంలో 23 జిల్లాలకుగాను 22 జిల్లాలకే రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా అన్ని వ్యవహారాలను చూసుకున్నారని, ఖమ్మం జిల్లాను ఆనాటి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలకే వదిలిపెట్టారని సీఎం తెలిపారు. ఈ జిల్లా నేతలు ముఖ్యమంత్రి స్థాయిలాగా ఉంటారని వైఎస్ రాజశేఖరెడ్డి హయాంలో తాను ఈ జిల్లా గురించి తెలుసుకున్నాని, తాను పార్టీలో చేరినప్పుడు అహ్మద్‌పటేల్ కూడా ఈ విషయం స్పష్టం చేశారని సీఎం గుర్తు చేసుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో 10అసెంబ్లీ స్థానాలు ఉండగా 2014, 2018, 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఈ జిల్లా ప్రజలు ఒక్కొక్కసీటు మాత్రమే ఇచ్చారన్నారు. అలాంటి చైతన్యవంతమైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేస్తున్న పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి,మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌లను 3లక్షలకు పైగా మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్నిక ప్రచారానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఈ ఎన్నికల్లో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని, ఖమ్మంలో బీఆర్ఎస్ తరపున పోటీచేస్తున్న నామా నాగేశ్వరరావును గెలిపిస్తే కేంద్రమంత్రిని చేయిస్తానని ప్రగల్బాలు పలికారన్నారు. నామాను బద్‌నామ్ చేయడానికే కేసీఆర్ ఇలా మాట్లాడారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒకటి, రెండు సీట్లు వచ్చినా కేసీఆర్ వాటితో బీజేపీకే మద్దతు పలుకుతారని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్లచట్టాలు, నోట్ల రద్దు, జీఎస్టీ బిల్లు, సివిల్‌కోడ్, తదితర వాటిపై చట్టం చేస్తే బీఆర్ఎస్ ఎంపీలు, కేసీఆర్ నోరు మెదపకుండా మోదీకి మద్దతు పలికారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ గూడుపుఠానిలతో కుట్రలు చేస్తున్నాయన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో గుజరాత్, తెలంగాణకు మధ్య పోరాటం జరుగుతోందన్నారు. నరేంద్ర మోదీ పదేళ్లలో తెలంగాణకు నిధులు ఇవ్వలేదన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, రైల్వేకోచ్ ఫ్యాక్టరీలు, ఐఐటీలు తదితర పరిశ్రమలను పట్టించుకోలేదన్నారు. తెలంగాణకు బీజేపీ 'గాడిద గుడ్డు' ఇచ్చిందన్నారు.

రాష్ట్రంలోని 69లక్షల మంది రైతుల్లో 64లక్షల మందికి రైతుభరోసా' సాయం అందించామని, మిగిలిన 4లక్షల మందికి 8వ తేదీన వారి బ్యాంకు అకౌంట్లలో నిధులు జమచేస్తామని తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా ఒక పక్క వడ్డీలు చెల్లిస్తూ, మరోపక్క ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఉద్యోగులకు ప్రతీ నెల 1న జీతాలు చెల్లిస్తున్నామన్నారు. 'ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తే కేసీఆర్ ముక్కునేలకు రాస్తారా.. హరీష్‌రావు తన పదవికి రాజీనామా చేస్తారా' అని సీఎం రేవంత్ సవాల్ చేశారు.

కేంద్రంలో బీజేపీ 400సీట్లతో అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్‌లు రద్దుచేస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారని గుర్తుచేశారు. ఈసారి కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీల మైనార్టీల రిజర్వేషన్‌లను రద్దుచేయబోమన్నారు. కాంగ్రెస్ పార్టీకి సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, టీజేఎస్ పార్టీలు పూర్తిస్థాయి మద్దతు పలికారని తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కొదండారం,ఎమ్మెల్యేలు పాయం. మట్టా రాగమయి, జారే ఆదినారాయణ, వెంకట్రావు, రాందాస్‌నాయక్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని,ఖమ్మం సీపీఐ జిల్లా కార్యదర్శి బాగం, భద్రాద్రి జిల్లా సీపీఐ కార్యదర్శి సాబీర్‌పాషా, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, భద్రాద్రి జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పొదెం వీరయ్య, నాయకులు ప్రసంగించారు.

పార్టీ శ్రేణుల్లో జోష్...

ఖమ్మం, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తగూడెంలో శనివారం నిర్వహించిన జనజాతర సభకు భారీగా జనం, కేడర్ తరలిరావడం కాంగ్రెస్ వర్గాల్లో జోష్ నింపింది. మండే ఎండను సైతం లెక్కచేయక సాగిన జనజాతర సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరితో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, జిల్లా నాయకులు బాగం హేమంతరావు, సీపీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి పోతినేని సుదర్శన్ టీజేఎస్ వ్యవస్థాపకుడు కోదండరాంతోపాటు పలువురు నేతలు హాజరుకావడం కూటమి ఐక్యతను చాటి చెప్పింది. ఉదయం 12 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరితో కలిసి చేరుకున్నారు. సభలో ప్రజలు, కార్యకర్తల ఉత్సాహం చూసి రేవంత్‌రెడ్డి పులకరించారు.



జనజాతర సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

తప్పుడు కేసులకు భయపడం: భట్టి | రెఫరెండంలా చూడాలి : తుమ్మల | బీజేపీవి మోసపూరిత హామీలు: పొంగులేటి | బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలి:కూనంనేని 6



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు

ఒక్కసారి అవకాశం ఇవ్వండి..

- ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- స్థానికేతరులను గెలిపిస్తే మళ్లీ కనిపించరు
- బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

మధిర, మే 4: కమలం గుర్తుపై ఓటేసి తనను ఎంపీగా గెలిపిస్తే ప్రధానిని తీసుకొచ్చి ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి మధిరలో జరిగిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మీ మధ్య పెరిగి మీలో ఒకడిగా కలిసి తిరిగానని, స్థానిక సమస్యలు తనకు తెలుసన్నారు. జిల్లాలను విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధితోపాటు పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. స్థానికేతరులను నమ్మి ఓటేస్తే ఎన్నికల తర్వాత కనపడరన్నారు. స్వంత లాభం, కుటుంబ ప్రయోజనాల కోసం వస్తున్న పొరుగు వారిని నమ్మొద్దని విజ్ఞప్తిచేశారు. మన అభివృద్ధి, మన ధర్మం మన చేతుల్లోనే ఉందని ఇప్పటివరకు అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చినా.. అభివృద్ధిలేదని అంతా సొంత ప్రయోజనాలకోసమే పనిచేశారని ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసి చూపెడతానని తనను గెలిపించాల్సిందిగా కోరారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గెల్లా సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాలు వదిలి ఎవరితో పడితో వారితో పొత్తులు పెట్టుకుంటూ ప్యాకేజీ స్టార్లుగా మారారని ఆరోపించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన భట్టి మధిరకు చేసిందేమీలేదని విమర్శించారు. ఈ సభలో బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి ఏలూరు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, రాష్ట్ర, జిల్లా నాయకులు శిల్పారెడ్డి, విజయారెడ్డి, విజయరాజు, స్వర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేను పక్కా లోకల్..

- రైతు బిడ్డను ఆశీర్వదించండి..
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

మధిరటౌన్, మే4: ' రైతు కష్టాలు తెలిసిన వాడిని. నేను పక్కా లోకల్.. జిల్లా ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన మధిరలో రోడ్ షోలో ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి.. ఐదు నెలలైనా హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఓటు అడిగేందుకు మీ ఇంటికి వస్తే ముందు తులం బంగారం, ప్రతి మహిళకు ఇస్తానన్న రెండున్నర వేల నగదు, ప్రతి నిరుద్యోగికి ఇస్తానన్న ఐదు లక్షల కార్డు ఇచ్చాకనే ఓటు అడగమనండి లేదంటే వారికి చీపుర్లతో సమాధానం చెప్పాలని అన్నారు. గత ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే రైతుల సమస్యలు, జిల్లా సమస్యల పరిష్కారం కోసం పని చేశానని, అనేక సమస్యలపై గళమెత్తి ప్రభుత్వాన్ని నిలదీశానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఎఫ్ఆర్‌వో విజయలక్ష్మి

తుపాకులతో జంతువుల వేట

- 'ఎర్రుపాలెం' రిజర్వు ఫారెస్ట్‌లో ఇద్దరి అరెస్టు
- రెండు ద్విచక్ర వాహనాలు, ఒక తుపాకీ స్వాధీనం
- నిందితులు ఎన్టీఆర్ జిల్లా వాసులు
- పక్కా ప్లాన్‌తో పట్టుకున్న అటవీశాఖ అధికారులు 7

నేడు 'నీట్' 7

5 పరీక్షా కేంద్రాలు.. 3,260 మంది విద్యార్థులు



ఉదయం ఎండ.. సాయంత్రం వాన

- ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు
- కల్లాల్లో తడిసిన ధాన్యం రాశులు 7

సీఎం సభ హైలైట్స్

- ఉదయమే కొత్తగూడెం ప్రకాశం మైదానం పరిసరాలను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు.
- జనజాతర సభ ఏర్పాట్లను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పరిశీలించారు.
- సభా వేదికపై ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, ఎమ్మెల్సీలు ప్రసంగించారు.
- ఉదయం 11:55గం.లకు కొత్తగూడెం ప్రగతి మైదానాకి హెలికాప్టర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేరుకున్నారు.
- 12:04గం.లకు సీఎం రేవంత్‌రెడ్డి జన జాతర సభా వేదిక వద్దకు భారీ కాన్వాయ్‌తో చేరుకున్నారు.
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సభకు అధ్యక్షత వహించారు.
- తొలుత రేవంత్ రెడ్డిని మాట్లాడాలని పిలిచి, వెంటనే డిప్యూటీ సీఎం పేరు ప్రకటించారు.
- ఎమ్మెల్యే కూనంనేని భుజం తట్టి డిప్యూటీ సీఎం భట్టి తన ప్రసంగాన్ని వినిపించారు.
- వేదికపై ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులు రఘురాం రెడ్డి, బలరాంనాయక్ గాడిద గుడ్డు బొమ్మలను పట్టుకుని ఉండటం చూపరులను ఆకర్షించింది.
- మధ్యాహ్నం 1:15గం.లకు జన జాతర సభ వేదిక నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాన్వాయ్‌లో ప్రగతి మైదానంలోని హెలీకాప్టర్ వద్దకు వెళ్లారు.
- 1:31గం.లకు సీఎం హెలీకాప్టర్ వెళ్లిపోయింది.
- మండుటెండలను సైతం లెక్క చేయకుండా జనం సభకు తరలి వచ్చారు.
- సభా ప్రాంగణంలోకి కర్రలతో ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను పోలీసులు అనుమతించలేదు.

- కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్


సభ ప్రవేశ ద్వారంలో తనిఖీలు


వేదికపై కళాకారుల ఆటా, పాట


సభా ప్రాంగణంలో ఆకర్షణగా మూడు రంగుల బెలూన్లు

తప్పుడు కేసులకు భయపడం



రాజ్యాంగాన్ని కాపాడతామని రాహుల్‌గాంధీ చెప్పిన మాటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. "తప్పుడు కేసులు పెట్టి ఢిల్లీకి పిలిస్తే భయపడతామా" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు, గిరిజనులవే కాకుండా బీసీలు, మైనార్టీల రిజర్వేషన్లు, విలువైన ఆస్తులు, వ్యవస్థలను కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీరు వరకు పాదయాత్ర ద్వారా వివరించారన్నారు. రాజ్యాంగాన్ని రక్షిస్తామని భారత్ జోడో యాత్ర ద్వారా చాటిచెప్పారన్నారు. అదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, దీనికి ఆయనపై తప్పుడు కేసు పెట్టి ఢిల్లీకి పిలుస్తారా ? అని ప్రశ్నించారు.

బీజేపీవి మోసపూరిత హామీలు



రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మోసపూరిత హామీలు ఇచ్చి బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని కుటిల ప్రయత్నాలు చేస్తోందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. 400 సీట్లు కావాలంటూ రాజ్యాంగాన్ని మార్చే కుటిల ఆలోచనలో బీజేపీ ఉందన్నారు. బీజేపీకి బీ-టీంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ బుద్ధి ఖమ్మంలో కనిపించిందన్నారు. నామాను గెలిపిస్తే మంత్రి అవుతాడని చెప్పి వారి తెర వెనుక డ్రామాలను బయటపెట్టారని అన్నారు. పదేళ్లు ఏనాడు జిల్లాకు రాని కేసీఆర్ ఇప్పుడు కర్ర పట్టుకుని వచ్చి అబద్ధాలాడుతూ ఓట్లు అడుగుతున్నాడని విమర్శించారు. పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీలు జిల్లాకు చేసిందేమీ లేదన్నారు.

రెఫరెండంలా చూడాలి



వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సభ ఎంత ఆలస్యం జరిగినా ఎర్రటి ఎండలో ఉన్న జన ప్రభంజనం కాంగ్రెస్ విజయానికి సూచిక అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు లోక్‌సభ ఎన్నికలే రెఫరెండంగా భావించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తల కష్టం, శ్రమతో బీఆర్ఎస్‌ను ఓడించి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చుకున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలిపించుకోవాలని, ఈ ఫలితాలే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనకు గీటురాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు మూడు, ఆరునెలలుంటూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గడువులు పెడుతున్నారన్నారు. 15లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఉండేలా ప్రజలు తీర్పు ఇవ్వాలన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలి



పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డిపై డిల్లీ పోలీసులు అక్రమ కేసు లు బనాయించారని ఆరోపించారు. బీజేపీ నిజ స్వరూపాన్ని ఎండ గట్టడం వల్లనే సీఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారన్నారు. సింగరేణిని నాశనం చేసింది కేసీఆర్ ప్రభుత్వంలోనేనని గుర్తుచేశారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు అన్నదమ్ములా ఉన్నామన్నారు. భద్రాద్రి జిల్లానుంచి ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయతీలను తిరిగి జిల్లాలో కలిపేందుకు కృషి చేయాలన్నారు. మణుగూరు నుంచి రామగుండం వరకు రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాను సస్యశామలం చేయాలని, పాల్వంచ, కొత్తగూడం మున్సిపాలిటీని కార్పొరేషన్‌ను చేయాలన్నారు. ఎన్ఎండీసీని మళ్లీ ప్రారంభించాలని కోరారు.


ఎంపీ అభ్యర్థులను పరిచయం చేస్తున్న సీఎం


సీఎంతో మంత్రుల ముచ్చట

మంత్రులు తుమ్మల, భట్టికి
సీఎం కితాబు

కొత్తగూడెం, మే 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిట్ట అని సీఎం రేవంత్ రెడ్డి కితాబు చ్చారు. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో జరిగిన జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు బంధు, రుణమాఫీ గురించి మాట్లాడుతున్న సందర్భంలో వ్యవసాయరంగంలో మంత్రి తుమ్మల అలుపెరగని రైతులాగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పామాయిల్ సాగు విస్తీర్ణం పెరిగిందంటే దానికి కారణం మంత్రి తుమ్మలే అన్నారు. మరో దశలో ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కను సైతం పొగడ్తలతో ముంచేత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి వెళితే తగిన జాగ్రత్తలు తీసుకుని రాష్ట్ర ఖజానకు ప్రణాళికబద్ధంగా నిధులు సేకరించి వడ్డీలు కడుతున్నారని, అంతేకాకుండా ప్రతీ నెల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లింపులు చేస్తున్నట్లు కితాబుచ్చారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశంతో వచ్చిన ఖమ్మం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రఘురాం రెడ్డి కుటుంబం జిల్లాలో ఉన్న తమ ఆస్తులను ఆరోజుల్లోనే ప్రజలకు, ప్రభుత్వానికి పంచిన చరిత్ర ఉందన్నారు. రాజ్యసభలో తాను, లోక్‌సభలో రఘురామిరెడ్డి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఉంటే రాష్ట్రానికి వచ్చే నిధులు ఎవరూ ఆపలేరన్నారు.

సోనియమ్మకు రుణపడి ఉంటా...



తనకు ఖమ్మం లోక్‌సభ టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి ఎప్పటికీ రుణపడి ఉంటానని కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. 150 రోజుల్లో ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంది అన్నారు. ఎన్నికల అనంతరం రుణమాఫీ, పక్కాఇళ్లు రేషన్‌కార్డులు తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు, ముందుగా పార్లమెంట్ అభ్యర్థులను రాజ్యసభ్యురాలు రేణుకా చౌదరి ప్రజలకు పరిచయం చేశారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

సీఎం రేవంత్‌కు
ఘనస్వాగతం

లక్ష్మీదేవిపల్లి, మే4: కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటుగా డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, రాజ్యసభ్యురాలు రేణకాచౌదరి హెలీకాప్టర్‌లో వచ్చారు. వారికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాలోతు రాందాస్ నాయక్ శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.


సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, డాక్టర్ తెల్లం వెంకట్రావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు


వేదికపై నృత్యం చేస్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

సీఎం సభకు భారీ బందోబస్తు



పోస్టాఫీస్ సెంటర్ వద్ద ట్రాఫిక్ పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే4: భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు భారీ పోలీస్ బందోబస్త్ శనివారం మోహరించారు. సీఎం పర్యటన సందర్భంగా భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను మళ్లించి వాహనదారులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లా కేంద్రంలో విజయవాడ నుంచి వచ్చే వాహనాలను సింగరేణి మెయిన్ హాస్పిటల్, బూడిదగడ్డ, ఓల్డ్ ఆర్టీసీ డిపో మీదుగా పాల్వంచ, భద్రాచలం వైపునకు తరలించారు. ఖమ్మం, హైదారాబాద్ నుంచి వచ్చే వాహనాలను ఇల్లందు, టేకులపల్లి మీదుగా పాల్వంచ ప్రాంతం వైపుకు తరలించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లలో వాహనాలను మళ్ళించేందుకు భారీ కేడ్‌లను ఏర్పాటు చేశారు. జన జాతర సభ వైదికైన ప్రకాశం మైదానం ముందు భారీగా పోలీసు బలగాలు మోహరించారు. సభ వేదిక మీదకు వెళ్లే కాంగ్రెస్ నాయకుల పేర్లు నివేదికలో ఉంటేనే, స్టేజ్ పాస్ ఉంటేనే అనుమతించారు. స్టేడియం రెండో గేట్ నుంచి కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసి తనిఖీ చేసిన అనంతరమే మైదానంలోకి వెళ్లేందుకు అనుమతించారు. ట్రాఫిక్ మళ్లింపు పర్యవేక్షించిన వారిలో కొత్తగూడెం ఓఎస్డీ టి.సాయిమనోహర్, డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఉన్నారు. సభా ప్రాంగణం వద్ద భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, ట్రైనీ ఐపీఎస్ అధికారి విక్రాంత్ కుమార్ సింగ్ ఉన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ముఖ్యమంత్రి కాన్వాయ్ తనిఖీ

ఖమ్మం క్రైం, మే4: ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు వెళుతున్న సీయం కాన్వాయ్ వాహనాలను నగర శివారులోని ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద శనివారం సాయంత్రం పోలీసులు తనీఖీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెంలో శనివారం జరిగిన బహిరంగ సభకు సీయం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈనేపథ్యంలో హెలీప్యాడ్ నుంచి సభ వద్దకు వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి ఆయన కాన్వాయ్ కొత్తగూడేనికి వచ్చింది. తిరిగి ఆయన హెలీకాప్టర్‌లో వెళ్లిపోవడంతో వచ్చిన కాన్వాయి ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరింది. నగర శివారులోని పుట్టకోట సమీపంలో ఉన్న లోక్‌సభ ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు, ఎన్నికల అధికారులు కాన్వాయి వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీలకు కాన్వాయి సిబ్బంది పూర్తిగా సహకరించారు. తనిఖీల అనంతరం వాహనాలను సిబ్బంది హైదరాబాద్‌కు తీసుకు వెళ్లారు.


మాట్లాడుతున్న విజయరామారావు, తాండ్ర వినోద్‌రావు

రిజర్వేషన్లపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

» ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి విజయరామారావు

సత్తుపల్లి, మే 4: భారతీయ జనతాపార్టీ గెలిస్తే రిజర్వేషన్లు ఎత్తేస్తారని, రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని, ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి విజయరామారావు అన్నారు. శనివారం సత్తుపల్లిలో జరిగిన ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ లబ్ధి పొందేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగజారి బీజేపీపై నిందలు వేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మం లోక్ సభ నుంచి తాండ్ర వినోదరావును గెలిపిస్తే ఆయన రాబోయే రోజుల్లో కేంద్ర మంత్రి కూడా అవుతారని అన్నారు. ఎన్నికల్లో ఖమ్మంలో కమలం వికసిస్తుందని ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. ఒకటి రెండు పర్యాయాలు మాత్రమే ప్రజలను నాయకులు మోసం చేయగలుగుతారని, ప్రజలు వాస్తవం తెలుసుకున్న రోజున మోసం చేసిన రాజకీయ పార్టీలను మట్టి కరిపిస్తారని అన్నారు. కాంగ్రెస్‌లో ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికే రాజకీయం పరిమితమైందని జాతీయ మహిళా మోర్చా సభ్యురాలు డాక్టర్ వీరపనేని పద్మ ఆరోపించారు. ఈ సభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యానారాయణ, పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ సత్తుపల్లి కన్వీనర్ బాస్కర్ల వీరంరాజు, జిల్లా కార్యదర్శి మున్నా మిశ్రా, కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, సత్తుపల్లి మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనులు పాల్గొన్నారు.

239 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు


అధికారుకు సూచనలిస్తున్న కలెక్టర్

ఇల్లెందురూరల్, మే4: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భద్రాద్రి జిల్లాలో 239 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. శనివారం ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు.ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు, పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న సిబ్బంది ఫెసిలిటేషన్ సెంటర్‌ల ద్వారా తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు.

ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయటమే కర్తవ్యం

» వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి/ ఖమ్మం సంక్షేమ విభాగం, మే 4: కాంగ్రెస్ ప్రభుత్వంలో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మళ్లిస్తామని వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం సత్తుపల్లిలో జరిగిన ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రఘురాం రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాదిలోనే సత్తుపల్లి నియోకవర్గంలోని లంకాసాగర్‌కు గోదావరి జలాలను మళ్లిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు కూడా సీతారామా ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు పారిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పనులకు సంబంధించి ఢిల్లీలో అనుమతులు అవసరం ఉంటుందని, వాటిని సాధించేందుకు ఖమ్మం జిల్లా నుంచి మన ప్రతినిధిగా రఘురామిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇప్పటికే రఘురామిరెడ్డి విజయం ఖాయమైందని, ఇక రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రఘురామిరెడ్డికి రావాలని కోరారు.

బిడ్డను కాపాడేందుకు కేసీఆర్ చీకటి ఒప్పందం: పొంగులేటి

అవినీతి కేసులో అరెస్టయిన కల్వకుంట్ల కవితను కాపాడుకునేందుకే కేసీఆర్ బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకున్నారని రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కేసీఆర్ పాలనలో రూ.లన్నర కోట్లు దోచుకొని దాచుకున్నారని, ధరణి అడ్డం పెట్టుకొని వేలాది ఎకరాల భూమి కాజేసారని వీటన్నింటి నుంచి బయటపడేందుకు కేసీఆర్ బీజేపీతో కలిసిపోయారన్నారు. ఈ ఎన్నికల్లో పగలు బీజేపీని తిట్టి రాత్రి బీజేపీతో కేసీఆర్ కలుస్తున్నారుని ఆరోపించారు. ఈ క్రమంలోనే నామా నాగేశ్వరరావును గెలిపిస్తే కేంద్ర మంత్రి అవుతారని చెప్పటంలో ఆంతర్యం ఏదేనన్నారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని అభ్యర్థి రఘురాం రెడ్డి అన్నారు. ఈ సభలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు దయానంద్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మువ్వా విజయబాబు, సీపీఎం, సీపీఐ నాయకులు మాట్లాడారు.

ఖమ్మంలో తన గెలుపు ద్వారా ప్రజలకు మరింతగా ప్రభుత్వ వైద్యసేవలు పెంపు కోసం కృషి చేస్తానని ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి హామి ఇచ్చారు. ఖమ్మం సీపీఎం రెండో కమిటీ, బీవీకే ఆధ్వర్యంలో శనివారం మంచికంటి భవన్‌లో నిర్వహించిన వైద్యశిబిరంలో రఘురాంరెడ్డి పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బీఆర్ఎస్ అభ్యర్థి నామాను గెలిపించాలి

» మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం కార్పొరేషన్/ ఎర్రుపాలెం, మే4: బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. శనివారం రాత్రి నగరంలోని 3,5 డివిజన్లలో కార్పొరేటర్లు, నాయకులతో కలిసి పువ్వాడ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఆయన బల్లేపల్లిలోని దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలోఉండి చిల్లరమాటలు మాట్లాడటం సరికాదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధిచెప్పి బీఆర్ఎస్ అభ్యర్థి నామాను గెలిపించాలని పువ్వాడ కోరారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ మాటలునమ్మి మరోసారి మోసపోవద్దని బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. ఎర్రెపాలెం మండలంలోని పెద్దగోపవరం లింక్‌రోడ్డు నుంచి బనిగండ్లపాడు గ్రామంలో శనివారం రోడ్‌షో నిర్వహించారు. నామా నాగేశ్వరరావు శనివారం నగరంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయానికి వచ్చిన నామాను ఆమ్‌ఆద్మీ పార్టీనాయకులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా నాయకులు కొండబాల కోటేశ్వరరావు, చావా రామకృష్ణ, జడ్పీటీసీ సీలంకవిత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బల్లేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీమంత్రి పువ్వాడ

అతివలకే అందలం

» ఎనిమిది సార్లు మహిళలల్నే వరించిన విజయం

భద్రాచలం, మే 4: ఇక్కడ మహిళా అభ్యర్థులనే విజయం వరిస్తోంది. నాడు భద్రాచలం లోక్‌సభ స్థానం నుంచి, నేడు మానుకోట కేంద్రంగా ఉన్న ఎంపీ స్థానంలో ఇప్పటి వరకు 14 సార్లు లోక్‌సభ స్థానంకు ఎన్నికలు నిర్వహించారు. 1967లో భద్రాచలం కేంద్రంగా లోక్‌సభస్థానం ఆవిర్భవించగా నాడు కాంగ్రెస్ పార్టీ తరపున బి.రాధాబాయి ఆనందరావు తొలిసారిగా విజయం సాధించారు. అనంతరం ఆమె 1971, 1977, 1980లలో వరుసగా విజయం సాధించడం విశేషం. అలాగే 1989, 1991లలో కాంగ్రెస్ పార్టీ తరపున కర్రెద్దుల కమలాకుమారి విజయం సాధించారు. ఇదిలా ఉండగా కమలాకుమారి కేంద్రంలో మంత్రి పదవి బాధ్యతలు సైతం నిర్వహించారు. కాగా 1999లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన దుంపా మేరీ విజయకుమారి విజయం సాధించారు. 2009లో భద్రాచలం లోక్‌సభస్థానం రద్దయి మహబూబాద్ ఎస్టీ లోక్‌సభ నియోజకవర్గం ఆవిర్భవించింది. 2019లో టీఆర్ఎస్ తరపున పోటీ చేసిన మాలోతు కవిత విజయం సాధించారు.

మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ


కలెక్టరేట్‌లో శిక్షణ పొందుతున్న మైక్రో అబ్జర్వర్లు

కొత్తగూడెం, మే 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నిమిత్తం సుమారు మైక్రో అబ్జర్వర్లకు భద్రాద్రి జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సుమారు 250 మంది మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చినట్లు మైక్రో అబ్జర్వర్ ఎల్‌డీఎం రామిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఎన్నికల రోజు, ముందురోజు వారు చేయవలసిన బాధ్యతలను వివరించారు. పోల్ రోజున ఉదయం 5.15 నిమిషాలనుంచి సాయంత్రం చివరి ఓటరు ఓటు వేసే వరకు ప్రత నిమిషం, ప్రతి సెకను నిశిత పరిశీలన చేయాల్సిందిగా, వారికి ఇచ్చిన చెక్ లిస్ట్ పూర్తిచేసి అబ్జర్వర్‌కు అందజేయాలని సూచించారు. వీరిని 5నియోజకవర్గాలలో ఎక్కడైతే క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లు ఉంటాయో అక్కడ నియమించడం జరుగుందన్నారు. మైక్రో అబ్జర్వర్‌గా ఎల్ఐసీ, బ్యాంక్, సింగరేణి, హెవీ వాటర్ ఉద్యోగస్తులని నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఫర్ మైక్రో అబ్జర్వర్ ఎల్‌డీఎం రామిరెడ్డి, డీఎల్ఎమ్‌టీలుగా పూసపాటి సాయిక్రిష్ణ, కిరణ్ కుమార్ వ్యవహరించారు.

నేడు 'నీట్'

- 5 పరీక్షా కేంద్రాలు
- 3,260 మంది విద్యార్థులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 4: దేశవ్యాప్తంగా వివిధ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నిర్వహించే ఈ పరీక్షకు నగరంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, ఎస్‌ఈఎస్‌వీవీ సెంట్రల్ పబ్లిక్ స్కూల్, ఎస్‌వీఎం సెంట్రల్ పబ్లిక్ స్కూల్, మ్యాక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాల, బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ పరీక్షా కేంద్రాలలో మొత్తం 3,260మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు నిర్వహించనున్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల లోపు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుంది. 1:30 గంటల అనంతరం విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు.

పరీక్షా కేంద్రాల్లోకి ఎటువం టి ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆభరణాలు అనుమతించరు, ట్రాన్స్‌ఫరెంట్ వాటర్ బాటిల్, అడ్మిన్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటో తప్పని సరిగి తెచ్చుకోవాలి, విద్యార్థులు కేవలం స్లిప్పర్లు ధరించి మాత్రమే పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

రామయ్యకు స్వర్ణ తులసార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, మే 4: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి వారికి శనివారం ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన, నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ ప క్రియలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ గావించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శివరాం కుటుంబాన్ని ఆదుకుంటాం

● కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

కొత్తగూడెం, మే 4 (ఆంధ్రజ్యోతి): పిడుగు పాటుతో మృతి చెందిన బోడా శివరాం కుటుంబాన్ని ఆదుకుంటామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా. శుక్రవారం ములకలపల్లి మండలం ఒడ్డు రామవరం గ్రామంలో వరి కల్లం దగ్గర కాపలాఉన్న శివరాంపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి గుగులోత్ శ్రీను గాయలతో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ మృతి చెందిన బోడా శివరాం కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మృతి చెందిన శివరాం కుటుంబాన్ని అదనపు కలెక్టర్ వేణు గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంఘటన ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిందని, ఎన్నికల నియమావళిని అనుసరించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు.

మణుగూరు మునిసిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

మణుగూరుటౌన్, మే 4: మణుగూరు మున్సిపాలిటీలో ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా రావులపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా యాకయ్య, ఉపాధ్యక్షుడిగా దుర్గయ్య, సహాయ కార్యదర్శిగా నరసింహారావులతో పాటు 16 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. వర్కర్స్ హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, యూనియన్ రాష్ట్ర నాయకులు బత్తుల వెకంటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు రాజేందర్, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

దమ్మపేట, మే4: అనుమతులు లేకుండా అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శనివారం పాకలగూడెం, సీతారాంపురం, నాచారం, నాగుపల్లి గ్రామాల్లో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఈదాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 82 క్వార్టర్ల మద్యం, 18బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని దమ్మపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

వైరా, మే4: మునిసిపాలిటీ పరిధిలోని ఐదోవార్డులో ఉన్న ప్రభుత్వానికి చెందిన ఒక గుట్ట వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశాల మేరకు మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు శనివారం అడ్డుకున్నారు. నిర్మాణాన్ని నిలిపివేశారు. గుట్టపక్కన చేస్తున్న నిర్మాణానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు ఉన్నాయో చూపించాలని సంబంధిత వ్యక్తులను ప్రశ్నించారు. సంబంధిత పత్రాలను తీసుకొని మునిసిపల్ కార్యాలయానికి రావాలని కమిషనర్ ఆదేశించారు.



అక్రమ నిర్మాణాన్ని నిలిపివేస్తున్న మునిసిపల్ కమిషనర్ వేణు

ఉదయం ఎండ..సాయంత్రం వాన

- ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు
- తడిసిన ధాన్యం రాశులు
- ఈదురుగాలులతో తెగి పడ్డ విద్యుత్ తీగలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎండలు, వేడిగాలులతో ప్రజలు సతమతమవుతున్నారు. గత కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. కాగా శనివారం సాయంత్రం గాలివానతో కురిసిన వర్షానికి ప్రజలు కొంత ఊపిరిపీల్చుకున్నారు. అకాల వర్షానికి గ్రామాల్లో ధాన్యం తడిసింది. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపడిపోయాయి. రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.



కరకగూడెంలో సాయంత్రం వర్షం కురుస్తున్న దృశ్యం



కరకగూడెంలో ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

చండ్రుగొండ, మే 4: చండ్రుగొండ మండలంలో శనివారం గాలితో కురిసిన వడగండ్ల వానకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా కురిసిన గాలి వానకు కల్లాలోని వడ్లు సైతం తడిసిపోయాయి. అదే విధంగా మామిడి కాయ లు నేల రాలాయి. కొన్ని చోట్ల పూరిళ్లు, రేకుల షెడ్లు దెబ్బ తిన్నాయి. తీవ్ర ఎండలు, వడగాడ్పులతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

కరకగూడెం: మండల వ్యాప్తంగా రోజు రోజుకు ఎండ తీవ్రతతో మండల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా మండల వ్యాప్తంగా శనివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో కరకగూడెం ప్రధాన సెంటర్ ఎప్పుడు రద్దీగా ఉంటే సెంటర్ నిర్మానుష్యంగా మారింది. కాగా ఒక్కసారిగా శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దాంతో మండలంలోని కరకగూడెం, తాటిగూడెం, పద్మాపురం, అనంతారం, గొళ్ళగూడెం, భట్టుపల్లి, వెంకటాపురం, కలవలనాగారం గ్రామాల్లో రైతుల ధాన్యం తడిసింది.

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఆకస్మికంగా శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మండుతున్న ఎండలకు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపడిపోయాయి. దీంతో కొత్తగూడెంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురు గాలులకు ట్రాఫిక్ భారీ కేట్లు సైతం ప్రధాన రహదారి మీదికి కొట్టుకొచ్చాయి.

పెనుబల్లి: పెనుబల్లి మండలంలో నాలుగురోజులుగా 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో శుక్ర, శనివారాల్లో వర్షం కురవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. శనివారం గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. లింగగూడెం, గట్టుగూడెంలో వడగండ్ల వాన కురిసింది. చెట్లు నేలకొరిగాయి. గాలివాన బీభత్సంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఆళ్లపల్లి/గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల వ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం ఒక్కరిగా వాతవరణం చల్లబడి వర్షం పడింది.



చండ్రుగొండలో కల్లాల్లో దడిసిన వడ్లు

పిడుగుపాటుతో వ్యక్తి మృతి

ఇల్లెందు. మే4: పిడుగు పడి వ్యక్తి మృతి చెందాడు. బయ్యారం మండలం మిరియాల పెంట ఏరియాలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన గొడుగు సుమంత్(36) శనివారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో సమీపంలో చెట్టు కిందకు వెళ్లాడు. కాగా అదే సమయంలో చెట్టుపై పిడుగుపడడంతో అపస్మారస్థితిలోకి వెళ్లాడు. గమనించిన సమీపంలోని రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అతడిని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



పెనుబల్లిలో కూలిన చెట్టు



కొత్తగూడెంలో వర్షం పడుతున్న దృశ్యం



చండ్రుగొండలో తెగి పడిపోయిన విద్యుత్ తీగలు



చండ్రుగొండలో నేలరాలిన మామిడికాయలు

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంల తరలింపు

ఖమ్మం కలెక్టరేట్, మే 4: అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు అదనపు ఈవీఎంను తరలించినట్లు ఖమ్మం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాం నుంచి అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 35మంది అభ్యర్థులు పోటీలో ఉన్న నేపథ్యంలో 3బ్యాలెట్ యూనిట్లు అవసరం కానున్న నేపథ్యంలో పోలింగ్ నిర్వహణకు గతంలో కేటాయించిన ఈవీఎంలకు అదనంగా బ్యాలెట్ యూనిట్లను ర్యాండమైజేషన్ ద్వారా జిల్లాలోని 5అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కేటాయించినట్లు తెలిపారు.

ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 888 బ్యాలెట్ యూనిట్లు, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 725బ్యాలెట్ యూనిట్లనూ శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు తరలించారు. మధిర అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 670బ్యాలెట్ యూనిట్లు మధిర పాలిటెక్నిక్ కళాశాల, వైరా అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 630బ్యాలెట్ యూనిట్లు వైరా సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 735బ్యాలెట్ యూనిట్లు జ్యోతి నిలయం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచనున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, సంబంధిత అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈవీఎంలను తరలిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

తుపాకులతో జంతువుల వేట

మధిర, మే 4: ఖమ్మం జిల్లా మధిర రేంజ్ పరిధిలోని ఎర్రుపాలెం మండలం భీమవరం రిజర్వు ఫారెస్ట్‌లో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తుపాకులతో జంతువులను వేటాడుతున్న ఇద్దరు వ్యక్తులను, వారికి సహకరిస్తున్న ఆటో డ్రైవర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నట్లు జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ సిద్ధార్థ విక్రమ్ సింగ్ తెలిపారు. శనివారం సాయంత్రం మధిరలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

అటవీశాఖ మధిర రేంజ్ పరిధిలోని ఎర్రుపాలెం భీమవరం రిజర్వు ఫారెస్ట్‌లో ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారు తుపాకులతో జంతువుల వేట జరుపుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో 9 మంది ఫారెస్ట్ అధికారుల బృందంతో ఒక సెర్చ్‌టీంను నియమించి రాత్రులందు నిఘా పెట్టినట్లు డీఎఫ్‌వో తెలిపారు. ఎఫ్‌ఆర్‌వో విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ఉప్పల సురేష్ నేతృత్వంలో సెర్చ్ టీం బృందం అధికారులు శుక్రవారం రాత్రి 8గంటల నుంచి అర్ధరాత్రి 2గ ంటల వరకు అటవీ ప్రాంతాన్ని తనిఖీచేస్తుండగా తుపాకులతో జంతువుల వేట జరపుతున్న సిగ్నల్స్ కనిపించాయి. అటువైపుగా వెళ్లి జంతువుల వేట జరుపుతున్న ఇద్దరిని తుపాకులతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరికి సహకరిస్తున్న మరొకరిని అదుపులోకి తీసుకున్నారు.

పట్టుబడిన వారిలో ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్‌జిల్లా వినగడపకు చెందిన శ్రీనివాసరావు(వయస్సు52), గంపలగూడెం మండలం కొత్తపల్లికి చెందిన పీ కృష్ణారావు (53)లుగా తెలిపారు. వీరు కాకుండా మరొకరు తెలంగాణకు చెందిన గుంటుపల్లి గోపారానికి చెందిన పి.మారేశ్వరరావు అనే ఆటోడ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. ఇంకొక నాల్గొవ వ్యక్తి వీరికి సహకరించినట్లు సమచారం. వీరి వద్దనుంచి రెండు ద్విచక్రవాహనాలు, తుపాకిని స్వాధీనం చేసుకొన్నారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురిని వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సాహసోపేతంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొని అతి కొద్ది సమయంలోనే విశేష ప్రతిభ కనబర్చిన మధిర ఎఫ్‌ఆర్‌వో విజయలక్ష్మి, భీమవరం ఎఫ్‌ఎస్‌వో సురేష్, ఎఫ్‌బీవోలు నాగేశ్వరరావు, రమేష్, సురేష్, శ్రీనివాస్, రాజేందర్, రాంబాబులను డీఎఫ్‌వో అభినందించారు. అంతేకాక వీరికి రాష్ట్రస్థాయిలో అవార్డుకోసం సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో మధిర రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

చండ్రుగొండ, మే 4: ప్రమాదవశాత్తూ కాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బెండాలపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఒడిస్సా రాష్ట్రం మల్కానిగిరి జిల్లాకు చెందిన వలస కూలీ గడ్డిగూడ సంతోష్‌కుమార్(45)కొంత మందితో కలిసి బెండాలపాడు సమీపంలో సీతారామ ప్రాజెక్టు కాల్వపై నిర్మిస్తున్న వంతెన పనులు చేసేందుకు రెండు రోజుల క్రితం వచ్చాడు. ఈ క్రమంలో శనివారం స్నానం చేసేందుకు కాల్వలోకి దిగగా అదుపుతప్పి నీటిలో పడిపోయాడు. అతడిని గమనించిన సహచరులు అతడిని బయటికి తీయగా.. అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మాచినేని రవికుమార్ తెలిపారు.

ఈతకు వెళ్లి వ్యక్తి..

రఘునాథపాలెం, మే 4: ఈతకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోయచెలక గ్రామానికి చెందిన బోరిగోర్ల నర్సయ్య(43) శనివారం మద్యం సే వించి గ్రామానికి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో ఈత కోసం వెళ్లాడు. ఈ క్రమంలో ఈత కొడుతూ నర్సయ్య ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయమై మృతుడి తల్లి ఆదేమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

ఆర్టీసీ పురోగతికి డ్రైవర్, కండక్టర్లే కీలకం

- ఆర్టీసీ ఉమ్మడి ఖమ్మం రీజియన్ మేనేజర్ సీహెచ్ వెంకన్న

మధిర, మే 4: సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆర్టీసీ పురోగతికి డ్రైవర్లు, కండక్టర్లే కీలకమని ఆర్టీసీ ఉమ్మడి ఖమ్మం రీజియన్ మేనేజర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. శనివారం మధిర డిపోలో ఆర్టీసీ ఖమ్మం రీజియన్ స్థాయి ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గౌండ్ హెల్త్ ఛాలెంజ్ పేరుతో చేపట్టిన కార్యక్రమంలో రీజియన్ పరిధిలోని డిపోలలో ఉన్న అన్ని విభాగాల ఉద్యోగులకు 11 రకాల ఆరోగ్య పరీక్షలను చేసి నిపుణులైన వైద్యులతో అవసరమైన చికిత్సలు చేయిస్తున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకం విజయవంతం కావడంలో డ్రైవర్లు, కండక్టర్లు పాత్ర వెలకట్టలేదని ప్రశంసిస్తూ వారి నిబద్ధతను కొనియాడారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని 7 డిపోలలో ఉత్తమ ఫలితాలు కనబర్చిన 20 మంది డ్రైవర్లను, 14మంది కండక్టర్లను, 6 టీఐఎంలు, 10మంది అద్దె బస్సు డ్రైవర్లను, 6గురు మెకానిక్‌లను ఈసందర్భంగా సన్మానించారు.

ఉత్తమ బస్‌స్టాండ్లుగా మధిర, భద్రాచలం

ఖమ్మం రీజియన్ పరిధిలో ఉత్తమ బస్‌స్టాండులుగా మధిర, భద్రాచలం బస్టాండ్లు ఎంపికయ్యాయని ఆయన తెలిపారు. మధిర, భద్రాచలం డిపో మేనేజర్లను ఈసందర్భంగా ఆర్ఎం అభినందించి సన్మానించారు. ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవరిస్తూ ఎక్కువ ఆదాయం తేవడానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ప్రగతి చక్ర అవార్డులు పొందిన ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన ఉద్యోగులు కూడా అవార్డులు పొందేలా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉమ్మడి రీజియన్ పరిధిలోని అన్ని డిపోల మేనేజర్లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ పవిత్ర, పర్సనల్ ఆఫీసర్ శ్రీహరి, అకౌంట్స్ ఆఫీసర్ బాలస్వామి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మధిర డిపో మేనేజర్‌ను సన్మానిస్తున్న అధికారులు

భార్య మందలించిదని.. మనస్తాపంతో భర్త ఆత్మహత్య

కామేపల్లి, మే4: మద్యానికి బానిసై కుటుంబ పోషణ పట్టించుకోవడం లేదని భార్య భర్తను మందలించడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బాసిత్‌నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. బాసిత్‌నగర్ గ్రామానికి చెందిన బాదావత్ రవి (38) మద్యానికి బానిసై కుటుంబాన్ని పటించుకోవడం లేదని భార్య సుశీల, భర్త రవిని మందలించడంతో ఈనెల 3న గడ్డిమందు తాగాడు. అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి టీటీ పోటీల్లో భద్రాద్రి క్రీడాకారుల ప్రతిభ



బహుమతులతో క్రీడాకారులు లోకేష్, చైతన్య

చుంచుపల్లి, మే4: ఇటీవల ఖమ్మంలో ముగిసిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన పురుషుల జట్టు ప్రతిభను చాటారు. పురుషుల సింగిల్స్ పోటీల్లో కొత్తగూడేనికి చెందిన లోకేష్ సింగిల్స్ విజేతగా నిలిచాడు. అదే విధంగా డబుల్స్ విభాగంలో కొత్తగూడేనికి చెందిన లోకేష్, చైతన్యలు గెలుపొందారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సింగిల్స్, డబుల్స్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను సీనియర్ క్రీడాకారులు థామస్, అఫ్జల్ బేగం, వర్ధకరావు, బాలాజీ, రాంబాబు, రియాజ్, పాల్, శామంత్, బన్ను, ఇమ్మానియేల్, చందు తదితరులు అభినందించారు.

అగ్ని ప్రమాదంలో సుబాబుల్ తోట దగ్ధం

బోనకల్, మే4: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరున్నర ఎకరాల్లో సాగు చేసిన సుబాబుల్ చెట్లు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన ఊట్ల నరేందర్ బాబు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించడంతో దగ్ధమైందని బాధిత రైతు తెలిపాడు. దాదాపు రూ.7లక్షల విలువ చేసే పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.



అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న సుబాబుల్ తోట

అనారోగ్యంతో టీడీపీ నేత రమేష్ మృతి



రమేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి, మే4: మండల టీడీపీ సీనియర్ నాయకులు, ఎన్టీఆర్ అభిమాని కంచి రమేష్ నాయుడు (55) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, జిల్లా టీడీపీ నాయకులు తోటకూరి వెంకటేశ్వర్లు సందర్శించి నివాళులర్పించారు. మృతుడు రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల, మేదరి టోని, టీడీపీ జిల్లా నాయకులు మండెపుడి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సీపీఎం నాయకుడు మురళీకృష్ణ..



మురళీకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం


రఘునాథపాలెం, మే4: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మండల పరిధిలోని కామంచికల్ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు చెరుకూరి మురళీకృష్ణ(48) శనివారం మృతి చెందాడు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి త మ్మినేని వీరభద్రం మృతదేహాన్ని సందర్శించి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ మురళీకృష్ణ, ఆయన తండ్రి చెరుకూరి రాఘవయ్య సీపీఎం పార్టీ కోసం చేసిన పోరాటాలను, ఎదుర్కొన్న ఇబ్బందులు, కేసుల్ని, జైలు జీవితాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మండల కార్యదర్శి నవీన్‌రెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, హనుమంతు, శేషగిరి, గండు లక్ష్మీనారాయణ, నరేశ్, పుచ్చకాయల కమలాకర్ పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ జ్ఞానసుందర్‌రావు...



జ్ఞానసుందర్‌రావు

ఖమ్మంక్రైం, మే4: ఖమ్మం ఏఆర్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.జ్ఞానసుందర్‌రావు అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసు అసోసియేసన్ సభ్యులు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, ఆర్ఐ కామరాజు, మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు దహనసంస్కార ఖర్చుల నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు.



హోమ్ ఓటింగ్‌ను పరిశీలించిన ఎన్నికల పరిశీలకుడు

వైరా/కొణిజర్ల,మే4: వైరా మునిసిపాలిటీ పరిధిలోని పల్లిపాడులో శనివారం హోమ్ ఓటింగ్ సరళిని శనివారం ఖమ్మం పార్లమెంట్ జనరల్ అబ్జర్వర్ సంజయ్ జి.కోల్టే పరిశీలించారు. హోమ్ ఓటింగ్ కేంద్రాలకు వెళ్లి అక్కడ ఓటింగ్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ వ్యక్తులను అనుమతించవద్దని ఆదేశించారు. వైరా మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు, కొణిజర్ల తహసీల్దార్, ఎంపీడీవో అబ్దుల్ హస్సేన్, రోజారాణి, ఎన్నికల అధికారులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంకార్పొరేషన్: నగరంలోని ముస్తఫానగర్‌లో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి, నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి శనివారం హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. మొబైల్ పోలింగ్ ద్వారా పోస్టల్‌బ్యాలెట్ పద్ధతిలో హోం ఓటింగ్ చేపడుతున్నట్లు ఆదర్శ్‌సురభి పేర్కొన్నారు. అనంతరం పోలీస్‌కాలనీలో, ఖమ్మం నగర పాలకసంస్థ కార్యాలయంలో పోస్టల్‌బ్యాలెట్ కేంద్రాలను సందర్శించారు.

విద్యుత్ వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

మధిర, మే 4: విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం మధిరలో ఏడీఈ అనురాధ తమ సిబ్బందితో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రమాదాలు జరగకుండా సిబ్బంది పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మధిర టౌన్, రూరల్, ఎర్రుపాలెం, మామునూరు ఏఈలు అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, అనూష, శ్రీనివాసరావు, లావణ్య ప్రవీణ్, చీనా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నామా కృష్ణయ్య జన్మదిన వేడుకలు




కేక్‌ను కట్ చేస్తున్న నామా కృష్ణయ్య, రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

నేలకొండపల్లి,మే4:మధుకాన్ షుగర్స్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ ఎండీ నామా కృష్ణయ్య జన్మదిన వేడుకలను శనివారం మధుకాన్ షుగర్స్ ఆవరణలో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులు నామా కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తలసీమియా బాధితుల కోసం ఫ్యాక్టరీ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 55 మంది రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ జీఎం కోటయ్య, సీనియర్ జీఎం ఫైనాన్స్ ఎస్. వెంకటేశ్వర్లు, మేనేజర్, హెచ్‌ఆర్ యం.నరేష్, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రతోనే రోహిత్ ఆత్మహత్య వక్రీకరణ

ఖమ్మంసంక్షేమవిభాగం, మే 4: రాజకీయ కుట్రదోనే దళితుడైన వేముల రోహిత్ ఆత్మహత్యను పోలీసులు వక్రీకరించి హైకోర్టుకు నివేదికలు పంపారని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. శనివారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రోహిత్ మరణం రాజకీయం వెనుక ఆర్ఎస్ఎస్ ప్రోద్బలం ఉందని ఆరోపించారు.

సిగ్నల్స్ ప్రాంతంలో గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలి

ఖమ్మం సంక్షేమవిభాగం, మే4: ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులు కనీసం 2 నిమిషాలు ఎండలో ఉండాల్సి వస్తోందని, నీడ కోసం గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి రాకేష్ కోరారు. ఈ మేరకు శనివారం ట్రాఫిక్ అధికారులకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. బల్లేపల్లి కూడలిలో సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. నాయకులు మంద నరేశ్, జక్కుల భరత్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

వేంసూరు, మే4: మండలంలోని లచ్చగూడెంలోని ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌభాగ్యలక్ష్మీ వ్రతంలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

త్రివేణి విద్యార్థులను అభినందించిన కలెక్టర్, డీఈవో



ఖమ్మం ఖానాపురంహవేలి మే4: పదోతరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన త్రివేణి పాఠశాల విద్యార్థులను శనివారం కలెక్టర్ గౌతమ్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ అభినందించారు. 13 మంది విద్యార్థులు ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను, డీఈవోను కలిశారు. వారు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సాధించిన విజయాల పట్ల పాఠశాల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, కృష్ణవేణి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు.

వడదెబ్బతో జర్నలిస్టు మృతి



తల్లాడ,మే4: వడదెబ్బకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి తాళ్లూరి దర్గయ్య(45)శనివారం మృతిచెందాడు. దర్గయ్యకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. వడదెబ్బ కారణంగా ఆయనకు వాంతులు, విరోచనాలు కావడంతో శుక్రవారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. దర్గయ్య సుదీర్ఘకాలం పాటు ప్రజాశక్తి, మనం పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశాడు.

కేసు నమోదు

చింతకాని,మే4: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహితతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి శుక్రవారంరాత్రి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలిని వేధించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

ముత్యాల కవచాలంకరణలో జమలాపురం శ్రీవారు

ఎర్రుపాలెం మే 4: జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి శ్రీవారిని ముత్యాలకవచంతో అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కల్యాణ వేదికవద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయ సిబ్బంది భక్తులకు ఉచిత అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, సూపరిండెంట్ కె.విజయకుమారి, సిబ్బంది ఈ.కృష్ణప్రసాద్, సాయి, వంశీ, విజయ్, మారుతిరావు, విజయ్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞానకేంద్రంలో స్వర్ణోత్సవం

వైరా, మే4: కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవాన్ని శనివారం వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. డాక్టర్ మోహన్‌సింగ్ మెహత ఆధ్వర్యంలో తొలిసారి పాండిచ్చేరిలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు దేశంలో 731కృషి విజ్ఞాన కేంద్రాలు ప్రారంభించారని వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు నూతన వరి వంగడాలను పండించటంతోపాటు క్షేత్ర పరిశీలనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. అభ్యుదయ పారిశ్రామికవేతలకు అవగాహన కల్పించటం ద్వారా కృషి విజ్ఞాన కేంద్రాలు దేశంలో గొప్ప వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలుగా పనిచేస్తున్నాయన్నారు. రైతులకు నేరుగా వరి విత్తే పద్ధతి, అధిక సాంద్రత పత్తి సాగు, చీడపీడల యాజమాన్యం, నేలల అభివృద్ధి యాజమాన్యంపై ఈ సందర్భంగా శిక్షణనిచ్చారు. కేవీకే శాస్త్రవేత్త ఫణిశ్రీ, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

తిరుమలాయపాలెం, మే4: ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రచారం నిర్వహించారు. మండలంలోని రఘునాథపాలెం, తిమ్మక్కపేట గోపాలపురం గ్రామాల్లో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఓర వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సండ్ర వెంకన్న, ఆశీర్వాదం, పత్తి నాగేశ్వరరావు, ప్రభాకరరావు, పాల్గొన్నారు.

దళితులు రఘురాంరెడ్డికి అండగా నిలవాలి

ఖమ్మం రూరల్, మే 4: సీపీఐ, సీపీఎం పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి దళిత సమాజం ఓట్లు వేసి అండగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు కొప్పుల ఆంజనేయులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తండ్రి రామసహాయం సురేందర్‌రెడ్డి 4సార్లు ఎంపీగా, 4సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి దళితుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. దళితులకు భూమి కూడా పంపిణీ చేసిన గొప్ప వ్యక్తిగా కొనియాడారు. దళితులను బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గంలో ఎక్కడాకూడా దళితులకు సముచితస్థానం కల్పించలేదన్నారు. ఖమ్మం రూరల్ మండల నాయకుల తీరు కారణంగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ఆంజనేయులు తెలిపారు. మంత్రి పొంగులేటి దళితులకు సముచిత స్థానం కల్పిస్తారన్న విశ్వాసం ఉందన్నారు.

నిలిచిన భగీరథ నీరు

కల్లూరు, పెనుబల్లిలో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



కల్లూరులో ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా

పెనుబల్లి/కల్లూరు, మే 4: కల్లూరులో నాలుగు రోజుల నుంచి మిషన్‌భగీరథ మంచినీటి సరఫరా నిలిచి పోయింది. ఫలింగా స్థానికంగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్నది. మరో వైపున పంచాయితీ తరుపున పెద్ద చెరువు వద్ద నీటిని తోడే 15 హెచ్‌పీ విద్యుత్ మోటార్లు లోడింగ్ పెరిగి కాలిపోయాయి. విద్యుత్ సరఫరాలో అనుసంధానం గల ట్రాన్‌ఫార్మ కూడ సాంకేతికంగా లోపంతో విద్యుత్ అంతరాయం కలిగింది. దీంతో ఆయా మంచినీటి పథకాలు పనిచేయనందున కల్లూరు పట్టణంలోని పరిసర విధుల్లో తాగునీటి సరఫరా నిలిచి పోయింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు పంచాయితీ తరుపున ప్రత్యేక అధికారి ఆదేశాల మేరకు శనివారం ఉదయం నుంచి ట్యాంకర్ ద్వార పలు వీధుల్లో మంచినీటి సరఫరా చేశారు. ఆ క్రమంలో గోపాలకుంట, తిరువూరు క్రాస్ రోడ్ ఎస్టీ కాలనీ, మధిర బ్రాంచి కాల్వ ఒడ్డున గల ఏరియాల్లో గల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేశారు. స్థానిక పంచాయితీ కార్యదర్శి కృష్ణారావు పర్యవేక్షణలో ప్రత్యామ్నాయంగా ఈ తాగునీటిని సరఫరా చేశారు. భగీరథ మంచినీటి సరఫరాతో పాటుగా స్థానిక పెద్దచెరువు వద్ద మరో పథకం ద్వారా విద్యుత్ మోటార్లను మర్మతులు చేసి తిరిగి మంచీనటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. అప్పటి వరకు స్థానికంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తామని కార్యదర్శి కృష్ణారావు తెలిపారు. ఈ మంచినీటిని పంచాయితీ సిబ్బంది ఊడల కృష్ణతో పాటుగా సిబ్బంది దగ్గర ఉండి నీటి పంపిణీ చేశారు.

పెనుబల్లిలో ట్యాంకర్లతో నీటి సరఫరా

పెనుబల్లి: ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి మిషన్ భగీరథ నీరు సరిపడినంత రాకపోవడంతో పెనుబల్లి, వీఎంబంజర్ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎస్వీప్రసాదరావు, కె.రవి ఆధ్వర్యంలో పంచాయతీ ట్యాంకర్ల ద్వారా గ్రామాల్లోని ప్రజలకు నీటిని సరఫరా చేశారు.పెనుబల్లి అంబేద్కర్ కాలనీ, వీఎంబంజర్‌లోని బేడాబుడగ జంగం కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు.



పెనుబల్లి అంబేద్కర్ కాలనీలో ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్న దృశ్యం

ఘనంగా మాజీ సీఎం జలగం జయంతి

కల్లూరు, మే4: మాజీ సీఎం జలగం వెంగళరావు జయంతిని కల్లూరులో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానికంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు కేక్ కట్ చేశారు. అనంతరం జలగం చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ ఉమ్మడి రాష్ట్రానికి, జిల్లాకు జలగం వెంగళరావు చేసిన సేవలను కొనియాడారు. జిల్లాకు సాగర్ జలాలు రావటంలో జలగం కృషి ఎంతోగాను ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందర్‌రావు, మాదిరాజు అన్నమరాజు, బాగం ప్రభాకర్‌రావు, ఎస్కే యాఖుబ్‌అలి, ఉబ్బన గోపాలస్వామి, పెద్దబోయన శ్రీనువాసరావు, భుక్యా శివకుమార్, బైర్ల కాంతరావు, యాసా శ్రీకాంత్, మట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

మధు సేవలు మరువలేనివి

వైరా, మే4: లయన్స్‌క్లబ్-2 గవర్నర్, దాల్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు నంబూరు మధు సేవలు మరువలేనివని పలువురు లయన్స్‌క్లబ్ ముఖ్యులు కొనియాడారు. మధు భౌతికంగా మన మధ్యలేకపోయినప్పటికీ ఆయన సేవలు ఎల్లవేళలా గుర్తుండిపోతాయని గుర్తు చేసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మధు దశదినకర్మలు శనివారం వైరాలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ కల్యాణమండపంలో జరిగిన మధు సంస్మరణ సభలో లయన్స్‌క్లబ్‌కు గోలి అమరేందర్‌రెడ్డి, డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఏరాల ప్రభాకర్‌రెడ్డి, కేవీ.ప్రసాద్, అమృతవల్లి కోటేశ్వరరావు, ఏరాల మోహన్‌రెడ్డి, దారా కృష్ణారావు, మోత్కూరి మురళీధర్, ఆర్.రాఘవరెడ్డి, ఉండ్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్, చింతనిప్పు వెంకటయ్య, వనమా విశ్వేశ్వరరావు, పెరుమాళ్ల కృష్ణమూర్తి, నూకల ప్రసాద్, గజ్జల కృష్ణమూర్తి, పెనుగొండ ఉపేందర్‌రావు మధు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నంబూరు మధు జ్ఞాపకార్థం ఇంజనీరింగ్ విద్యార్థిని హరి భవ్యశ్రీకి ల్యాప్‌టాప్‌ను బహూకరించారు.



మధు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఏప్రిల్ జీతాలు చెల్లించాలి

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఖమ్మంఖానాపురంహవేలి, మే4: ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఏప్రిల్ జీతాలు చెల్లించాలని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని డిపో వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 2013 ఆర్పీఎస్ 50శాతం బాండ్ డబ్బులు అందరికి అందలేదన్నారు. మిగిలిన కేటగిరి ఉద్యోగులకు చెల్లించాలని, ఏప్రిల్ జీతాలు కొందరికే అందాయని, మిగిలిన ఉద్యోగులకు అందలేదని తక్షణం జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పిల్లి రమేష్, జగన్నాథం, బుచ్చిబాబు,లాజర్, నాగమణి, రమాదేవి పాల్గొన్నారు.

మధిర: ఆర్టీసీ ఉద్యోగులు మధిరలో శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీలో 2013లో జరిగిన వేతన సవరణ బాండ్ డబ్బులు వెంటనే చెల్లించాలని, డ్రైవర్లు, కండక్టర్లతో పాటు అన్ని కేటగిరీల వారికి ఒకే సారి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు ఎం రామచంద్రారావు, ఏ అరుణకుమారి, మధిర కార్యదర్శి నాగుల్‌మీరా పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తల్లాడ,మే4: మండల పరిధిలోని బాలపేట క్రాస్ రోడ్డు వద్ద ఎంఎంహెచ్‌హెచ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చిట్టెం బ్రహ్మం, పాలేపు బ్రహ్మేశ్వరరావు, వడ్డాణపు నరేష్, పడాల సైదులు, తొగరు గోవిందరావు, రామారావు పాల్గొన్నారు.

బీజేపీ,టీఆర్ఎస్‌లను ఓడించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

కామేపల్లి,మే4: మతోన్మాద బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామంలో మండల స్థాయి జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. లౌకిక ప్రజాస్వామ్య శక్తులు సీపీఎం, సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ మమబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలని గ్రామంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దుగ్గి క్రిష్ణ, వింజం నాగభూషణం, సీపీఎం మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, కిన్నెర రామచంద్రయ్య, కాటిన్ని క్రిష్ణమూర్తి, ఉప్పతల వెంకన్న, నరాటి నాగేశ్వరరావు, సూర్యనారాయణ, సకినాల శ్రీనివాస్, అనంతరాములు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం



వైరా,మే4: వైరాలో శనివారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమైంది. ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గానికి ఈనెల 13న జరుగనున్న ఎన్నికల విధుల్లో వివిధ నియోజకవర్గాల్లో పాల్గొనే వైరా నియోజకవర్గంలోని ఉద్యోగులు, మీడియా ఇతర వర్గాల వారికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనేందుకు ప్రత్యేకంగా ఓటింగ్ ప్రక్రియ చేపట్టారు. వైరా ప్రభుత్వ హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారమే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ పలు సాంకేతిక కారణాలతో వాయిదా పడింది.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం, మే4: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండంలోని పలు ప్రాంతాల్లో ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరారవు విజయం కోరుతూ ప్రచారం నిర్వహించారు.కొక్కిరేణి, తిరుమలాయపాలెం, మేడిదపల్లి, పాతర్లపాడు, సుబ్లేడరహస్నాబాద్, బచ్చోడు, రాజారం, పైనంపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈఎన్నికలకు కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, నాయకులు వీరన్న, కొండబాల వెంకటేశ్వర్లు, బానోతు రవి, శంకర్, శ్రీనుసర్సిరెడ్డి, కొప్పుల మధుసూదన్‌రెడ్డి, మంచానాయక్ పాల్గొన్నారు.

కురుమ యాదవులను మోసం చేసిన బీఆర్ఎస్

కల్లూరు, మే4: కురుమ, యాదవులను బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా మోసం చేసిందని, ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు మేకల మల్లిబాబు యాదవ్ పిలుపు నిచ్చారు. శనివారం కల్లూరులో మండల స్థాయిలో కురుమ యాదవుల సంఘ సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురామరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. అసెంబ్లీ సాక్షిగా కురమ యాదవులను కోటీశ్వరులను చేస్తానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ డీడీలు కట్టించుకుని రెండు సంవత్సరాలు గడిచిన గొర్రెలు పంపిణీ చేయలేదన్నారు. ఈ సమావేశంలో హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షురాలు యనుమల రుక్మిణి యాదవ్, యనుమల రాము, మార్త వీరయ్య, పొదిలి వెంకటేశ్వర్లు, రామకోటయ్య, తోట సుబ్బారావు గుంగుల వెంకటేశ్వర్లు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: ఎస్సీఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధి సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. రఘురాంరెడ్డికి మద్దతుగా ఎన్నికలప్రచారంలో భాగంగా శనివారం ఏన్కూరులో కురుమ, యాదవ సంఘ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వరదబోయిన నరసింహారావు, కాలసాని నరసింహారావు, పల్లెబోయిన నాగేశ్వరరావు, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, అల్లాడి నరసింహారావు, రేళ్ల శ్రీను పాల్గొన్నారు.

కమ్మ సంఘం ఏ రాజకీయ పార్టీకి మద్దతు పలకదు

ఖమ్మంఖానాపురంహవేలి, మే4: కమ్మ సామాజిక వర్గం ఏ రాజకీయ పార్టీకి మద్దతు పలకదని సంఘం సంయుక్త కార్యదర్శి నరేష్ చౌదరి అన్నారు. శనివారం స్వర్ణభారతి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమ్మ మహాజన సంఘం పేరుతో రామారావు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు చేసిన ప్రకటనను ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఈసీ సభ్యులు నల్లమల్ల రంజిత్ చౌదరి, నవీన్ చౌదరి, తాళ్ళూరి శ్రీనివాసరావు, వంశీ,కుర్రా శేఖర్, నల్లమోతు రంగారావు పాల్గొన్నారు.

దేశక్షేమంకోసం బీజేపీని ఓడించండి

ఖమ్మంకార్పొరేషన్, మే4: దేశక్షేమానికి బీజేపీని ఓడించాలని ఆమ్‌ఆద్మీ తెలంగాణా కోర్‌కమిటీ సభ్యులు నల్లమోతు తిరుమలరావు కోరారు. నగరంలోని ఆప్‌కార్యాలయంలో శనివారం ఆప్‌జిల్లా అధ్యక్షుడు స్వర్ణసుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు, వలంటీర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో పాలేరు, మధిర, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు పసుమర్తి శ్రీనివాస్, గంధం పుల్లయ్య, చరపా పాపారావు, సిద్దెల రాంబాబు, గుత్తా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వచ్చే 30 ఏళ్ల దేశ భవితను తేల్చే ఎన్నికలు ఇవే

సీనియర్ జర్నలిస్టు రాకా సుధాకర్

ఖమ్మంబైపాసరోడ్, మే4: ఇప్పుడు జరిగే లోక్‌సభ ఎన్నికలు వచ్చే 30 ఏళ్ల భారత భవితను నిర్ణయిస్తాయని రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు రాకా సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి విద్యావంతుల సమావేశంలో మాట్లాడుతూ నరేంద్రమోదీని బలోపేతం చేస్తే భారత విశ్వగురువుగా, జగజ్జేతగా మారుతుందన్నారు. ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోదరావును ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు, డాక్టర్ శీలం పాపారావు, డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరారవు, డాక్టర్ కావ్యాచంద్ యాలమూడి, మోతుకూరి నారాయణరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తాండ్ర సతీమణి ప్రచారం

ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు గెలుపుకోసం ఆయన సతీమణి వినీలారావు శనివారం నగరంలో 57వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. మోదీ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వినోదరావును భారీ మెజారిటీ గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రుద్రగాని మాదవ్‌గౌడ్, యుగంధర్, ఉపేందర్, పద్మ, విజయారెడ్డి, నర్సింహారావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నామా గెలుపు కోసం ముమ్మర ప్రచారం నిర్వహించాలి

తల్లాడ,మే4: ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు కోసం బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. శనివారం తల్లాడ మండలంలోని కేశ్వాపురం, ముద్దునూరు, కుర్నవల్లి, కలకొడిమ గ్రామాల్లో ఆయన పర్యటించి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం కుర్నవల్లిలో నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, మండల నాయకులు బద్దం కోటిరెడ్డి, శీలం కోటారెడ్డి, వనిగండ్ల అశోక్, వనిగండ్ల వెంకటేశ్వర్లు, అయిలూరి శివారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం ప్రారంభం

కల్లూరు: ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ నామా నామా నాగేశ్వరరావు విజయాన్ని ఆకాంక్షిస్తూ కల్లూరులో శనివారం ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు పెడకంటి రామకృష్ణ, ఎస్కే కమ్లి ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో నాయకులు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. తమ అభ్యర్థి నామా నాగేశ్వరావుకు మద్దతు నిస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయలు మేకల కృష్ణ, సిహెచ్ కిరణ్, బొల్లం వెంకటేశ్వర్లు, ఎస్‌డి ఇంతియాజ్, నవాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

కాంగ్రెస్, వామపక్షాల ఉమ్మడిగా ప్రచారం

వైరా, మే4: ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం వైరాలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఉమ్మడి ప్రచారం నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి అధ్యక్షతన మూడుపార్టీల సమావేశం జరిగింది. ఈనెల ఆరు నుంచి సమిష్టిగా ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం కూరగాయల మార్కెట్లో ప్రచారం చేశారు. శీలం వెంకటనర్సిరెడ్డితోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ బొంతు సమత, సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, నాయకులు కట్ల సంతోష్, మచ్చా బుజ్జీ, దాసరి దానియేలు, దొడ్డా పుల్లయ్య, పాలేటి నర్సింహారావు, ధార్న రాజశేఖర్, పమ్మి అశోక్, గుగులోతు రాము, పల్లపు కొండలు, బోళ్ల గంగారావు, మల్లు రామకృష్ణ, పణితి శ్రీను, శ్రీరామనేని తిరుపతిరావు, సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, మచ్చా మణి పాల్గొన్నారు.

సైనిక పాఠశాలకు ఎంపికైన ఉదయ్‌తేజ్



ఏన్కూరు, మే4: ఏన్కూరులోని శిక్షణ పొందిన ఉదయ్‌తేజ్ సైనిక పాఠశాలకు ఎంపికయ్యాడు. రాతపరీక్ష, శారీరక, ధారుడ్య, మౌఖిక పరీక్షల్లో అత్యంత ప్రతిభ చూపి కరీంనగర్ సైనిక పాఠశాలలో సీటు సాధించాడు. ఈ విద్యార్థిని శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణికిరణ్ ఉపాధ్యాయులు చింతనబోయిన నరసింహారావు, శారద, కృష్ణ, సత్యనారాయణ అభినందించారు.